ఓ వైపు ఉద్యోగం చేస్తూనే..


కార్గాం గోవర్ధన్

కుంటాల: ఓ వైపు ఉద్యోగం చేస్తూనే కళల కొలువు కోసం పక్కా ప్రణాళికతో సన్నద్ధమై విజయం సాధించాడు మండలకేంద్రానికి చెందిన కార్గాం గోవర్ధన్. ఈనెల 11న విడుదలైన గ్రూప్–2 పరీక్ష ఫలితాల్లో 394.5 మార్కులతో సత్తా చాటారు. రాష్ట్రస్థాయిలో 88వ ర్యాంక్, బాసర జోన్‌లో ఏడో ర్యాంక్ సాధించాడు. గ్రూప్–1 పరీక్షల్లోనూ 421 మార్కులు సాధించారు. 2011లో ఎస్‌బీఐలో బ్యాంకు ఉద్యోగం సాధించాడు. 2020 గ్రూప్–2లో ప్రతిభ కనబరిచి ఎక్సైజ్ ఎస్సైగా ఎంపికయ్యాడు. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా భీంగల్‌లో ఎక్సైజ్ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నాడు. తల్లి లక్ష్మి గృహిణి కాగా తండ్రి భూమన్న రైతు. గోవర్ధన్‌ను కుటుంబసభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

అదరగొట్టిన పంచాయతీ కార్యదర్శి


ప్రదీప్

కుంటాల: యువతా సమయం వృథా చేయకుండా కార్యాచరణ ప్రారంభిస్తేనే నిర్దేశించుకున్న లక్ష్యం చేరుకోవచ్చని నిరూపించాడు కుంటాల మండలంలోని లింబా(కె) గ్రామానికి చెందిన ప్రదీప్. గ్రూప్–2 ఫలితాల్లో 374.5 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 362వ ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం ప్రదీప్ బాసర మండలంలోని కిర్గుల్(బి) పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయనను పలువురు అభినందించి సన్మానించారు.

సర్కారు కొలువు కొట్టిన సాఫ్ట్‌వేర్


హరికృష్ణను అభినందిస్తున్న తల్లిదండ్రులు

మామడ: జిల్లా కేంద్రంలోని గాయిత్రిటౌన్‌షిప్‌కు చెందిన లింగాల గోపాల్–విజయలక్ష్మి దంపతుల కుమారుడు హరికృష్ణ గ్రూప్–2 ఫలితాల్లో సత్తా చాటాడు. రాష్ట్రస్థాయిలో 338వ ర్యాంకు బాసర జోన్ పరిధిలో28వ ర్యాంకును సాధించాడు. ఓవైపు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తూనే సర్కారు కొలువే లక్ష్యంగా చదివి విజయవంతమయ్యాడు. గ్రూప్–1లోనూ 412 మార్కులు సాధించినట్లు హరికృష్ణ తెలిపాడు. తమ కుమారుడి విజయంపై వ్యవసాయం చేస్తున్న తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పనులపై పర్యవేక్షణేది?


డ్రెయిన్, స్లాబుపై ఏర్పడిన పగుళ్లు

- నాసిరకంగా 161బీబీ హైవే పనులు
- క్షేత్రస్థాయిలో పరిశీలించని అధికారులు
- ఇబ్బందులు పడుతున్నామంటున్న వాహనదారులు


ముధోల్ కంటి ఆసుపత్రి సమీపంలో పడిన రెయిలింగ్

భైంసాటౌన్: భైంసా డివిజన్‌లో భైంసా–బాసర (28 కిలోమీటర్లు) మార్గంలో చేపడుతున్న 161బీబీ(బోధన్–భైంసా) జాతీయ రహదారి నిర్మాణ పనులు పలుచోట్ల నాసిరకంగా చేపడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా వేసిన సీసీ డ్రెయిన్లకు కొన్నిచోట్ల పగుళ్లు వస్తున్నాయి. సరైన వాటర్ క్యూరింగ్ లేకపోవడంతో సీసీ డ్రెయిన్లపై వేసిన స్లాబులకు చీలికలు ఏర్పడుతున్నాయి. పాదచారుల కోసం పాదబాటలపై నాసిరకం టైల్స్ వినియోగిస్తున్నారు. నామమాత్రంగా రెయిలింగ్ పనులు చేపడుతుండటంతో చిన్న ప్రమాదం జరిగినా రెయిలింగ్ ఊడిపోతున్నాయి. కొన్నిచోట్ల నిర్మాణదశలోనే రెయిలింగ్‌లు పడిపోతున్నాయి. కల్వర్టుల వద్ద సైతం అసంపూర్తిగా పనులు చేస్తున్నారు. ఇటీవల బాసర వద్ద ఓ లారీ కల్వర్టును ఢీకొన్న ఘటన విషయం తెలిసిందే. ఇక రోడ్డు పనుల విషయానికొస్తే భైంసా మండలంలోని దేగాం, తరోడ, బాసర మండలం బిద్రెల్లి గ్రామాల వద్ద కొన్నిచోట్ల రోడ్డు నిర్మించకుండా కంకర వేసి వదిలేశారు. దీంతో కంకర రోడ్డుపై ద్విచక్ర వాహనదారులు వెళ్తూ కింద పడుతున్నారు. దుమ్ము, ధూళి లేస్తుండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించడం లేదని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డు పక్కన మట్టి వేసేందుకు అన్నిచోట్ల తవ్వి తెచ్చిన పాతమట్టినే వినియోగిస్తున్నారు. దేగాం వంతెన వద్ద ఈ దృశ్యాలు కనిపిస్తున్నాయి. అందులో పెద్దపెద్ద రాళ్లు, చెత్తాచెదారం ఉంటోంది. దీంతో పనుల నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చర్యలు తీసుకుంటాం..

161బీబీ హైవేపై జరుగుతున్న పనులను ఆయా విభాగాల అధికారులు పర్యవేక్షిస్తారు. నాసిరకంగా పనులు చేపడితే క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. రెయిలింగ్ పనులు వెల్డింగ్‌తోనే చేస్తారు. వాహనం ఢీకొని ఉంటే ఎక్కడైనా పడిపోయి ఉండవచ్చు. పనులు పరిశీలిస్తున్నాం.

– సుభాష్, డీఈఈ, నిర్మల్


బాసర మండలం బిద్రెల్లి వద్ద మూసుకుపోయిన వైకుంఠధామానికి వెళ్లే మార్గం

పట్టించుకోని అధికారులు..

రూ.కోట్లతో చేపట్టిన 161బీబీ హైవే పనులపై సంబంధిత అధికారులు దృష్టి సారించడం లేదనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొన్నిచోట్ల రోడ్డుపై కంకర వేసి నెలల తరబడి వదిలేయడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు పొడువునా కొన్నిచోట్ల చిన్నసైజు కంకర, మొరం ఉండడంతో ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి కింద పడుతున్నారు. రోడ్డుపై మట్టి తొలగించకుండానే మార్కింగ్ సైతం చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డు పనుల నాణ్యతను సంబంధిత శాఖల అధికారులు పర్యవేక్షించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి


తనిఖీ చేస్తున్న ఎస్సై శ్రీనివాస్

తానూరు: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ఎస్సై శ్రీనివాస్ సూచించారు. బుధవారం మండలంలోని హిప్నెల్లి గ్రామ సమీపంలోని ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా వాహనాల ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు ఉన్నారు.

కొరిటికల్ పాఠశాలలో గ్రీవెన్స్ బాక్స్


సూచనలను బాక్స్‌లో వేస్తున్న విద్యార్థినులు

మామడ: పాఠశాల విద్యార్థులు తమ సమస్యలను నేరుగా ఉపాధ్యాయులకు చెప్పేందుకు ఇబ్బంది పడుతుంటారు. దీనిని అధిగమించేందుకు మండలంలోని కొరిటికల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో గర్ల్‌చైల్డ్ ఎంపవర్‌మెంట్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థినుల కోసం పాఠశాలలో రెండు పెట్టెలను ఏర్పాటు చేశారు. సాధారణ ఫిర్యాదులు, సూచనలు చేసేందుకు మరొకటి, మధ్యాహ్న భోజనం అనంతరం విద్యార్థుల అభిప్రాయం తెలుసుకునేందుకు ఉపయోగపడుతుంది. సూచనల పెట్టె ఇన్‌చార్జిగా ఉపాధ్యాయురాలిని నియమించారు. బాక్స్‌లో వచ్చిన సూచనలు, ఫిర్యాదులు పరిశీలించి విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తారు. సమస్య తీవ్రత ఎక్కువగా ఉంటే హెచ్‌ఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తారు. పాఠశాలలో సూచనలు, ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటుతో విద్యార్థుల అభిప్రాయం తెలుసుకునే అవకాశం కలుగుతుందని హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి తెలిపారు.

సంక్షిప్త వార్తలు

అపరిచితులకు ఓటీపీలు చెప్పొద్దు

లక్ష్మణచాంద: ఫోన్‌కు వచ్చే ఓటీపీలను అపరిచితులకు చెప్పవద్దని టీజీబీ రీజినల్ మేనేజర్ రామారావు అన్నారు. బుధవారం మండలంలోని వడ్యాల్ టీజీబీ శాఖ ఆవరణలో ప్రజలకు ఆర్థిక లావాదేవీలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన నామినీ మహిళకు బీమా కింద మంజూరైన రూ.20 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎంబీ.విలాస్, మేనేజర్ శ్రీకాంత్, పావని, సిబ్బంది, పాల్గొన్నారు.

సీనియర్లకే పరీక్షల విధులు కేటాయించాలి

కడెం: పదోతరగతి వార్షిక పరీక్షలకు సంబంధించి ఇన్విజిలేషన్ విధులను సీనియర్ టీచర్లకే కేటాయించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు భుక్యా రాజేశ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. శిక్షణ లేకుండా జూనియర్లకు విధులు కేటాయిస్తే పరీక్షల నిర్వహణలో లోటుపాట్లు జరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయం గతంలో డీఈవో దృష్టికి తీసుకెళ్లామని.. నిబంధనల ప్రకారం విధులు కేటాయించాలని కోరారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎల్‌ఆర్‌ఎస్ రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని మస్కాపూర్, సుర్జాపూర్ గ్రామాల్లో పర్యటించారు. నెలఖారులోగా భూములు క్రమబద్ధీకరణ చేసుకున్న వారికి 25శాతం రాయితీ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. గ్రామపంచాయతీల్లో రికార్డులు తనిఖీ చేశారు. నర్సరీలు, సెగ్రిగేషన్ షెడ్లు, వైకుంఠధామాలు పరిశీలించి సూచనలు చేశారు.

'కళాశాలలకు బకాయిలు చెల్లించాలి'

కుంటాల: ప్రైవేటు డిగ్రీ కళాశాలల యజమాన్యాలకు ఫీజు బకాయిలు చెల్లించకుంటే వచ్చే సెమిస్టర్ పరీక్షలు నిర్వహించబోమని తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం(టీపీడీఎంఏ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోయ సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కల్లూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ డిగ్రీ, పీజీ కళాశాలలకు ప్రభుత్వం రూ.2500 కోట్ల బకాయిలను మార్చి20 లోపు చెల్లించాలంటూ గడువు విధించినట్లు తెలిపారు. బకాయిలు విడుదల చేయకపోవడంతో ఆర్థిక భారం, భవనాల అద్దె చెల్లించడం లేదని వాపోయారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

సర్వే పరిశీలన

ఖానాపూర్: ఎంఈవో ప్రేమ్‌సాగర్ సూచన మేరకు పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో శ్యాంపుల్ సర్వేను సీఆర్పీ కవిత పర్యవేక్షించారు. పాఠశాల స్థాయిలో జరిగే శ్యాంపు సర్వేను పకడ్బందీగా అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అంతకముందు పలు పాఠశాలను సందర్శించారు.

జిల్లా అధ్యక్షుడికి సన్మానం

ఖానాపూర్: ఇటీవల బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన రితేశ్ రాథోడ్‌ను బుధవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. మండలంలోని మస్కాపూర్ గ్రామంలో ఉన్న 245, 246 బూత్ కమిటీల ఆధ్వర్యంలో సన్మానించారు. మహేందర్, ఉపేందర్, మనోజ్, రవీందర్‌రెడ్డి, భూమన్న, గిరి, స్వామి, రాజన్న, కృష్ణ, పోతరాజు, సుధాకర్ ఉన్నారు.

పరీక్షప్యాడ్లు పంపిణీ

సారంగపూర్: మండలంలోని పదో తరగతి విద్యార్థులకు కోర్వ నవీన్ రామకృష్ణారెడ్డి ట్రస్ట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో కోర్వ నవీన్ బుధవారం పరీక్షప్యాడ్లు, డిక్షనరీలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21 నుంచి నిర్వహించే వార్షిక పరీక్షలకు విద్యార్థులంతా సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నర్సయ్య, సత్యం, రామలింగారెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

పాఠశాల అప్‌గ్రేడ్‌కు కృషి

దస్తురాబాద్: డీఈవో దృష్టికి తీసుకెళ్లి మండలంలోని బుట్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను జెడ్పీహెచ్‌ఎస్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తానని ఎంఈవో గంగాధర్ అన్నారు. బుధవారం పాఠశాలలో హెచ్‌ఎం బ్రహ్మచారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. చైర్‌పర్సన్ అంజవ్వ, పీఏసీఎస్ వైస్ చైర్‌పర్సన్ రామడుగు శైలజ, రమేశ్‌రావ్, పంచాయతీ కార్యదర్శి రవీందర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవీందర్, తిరుపతి, రాజేందర్, మల్లేశ్ పాల్గొన్నారు.

సూర్యాపూర్‌లో పూజలు

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ శ్రీ రాజరాజేశ్వర ఆలయ ఆవరణలో జువ్వి చెట్టుపై వినాయకుడి ఆకారం ఉన్నట్లు గ్రామస్తులు బుధవారం సాయంత్రం గుర్తించారు. చెట్టుపై రెండు కళ్లు, తొండం ఆకారం ఏర్పడటంతో మహిళలు పూజలు చేశారు.

ముందస్తు హోలీ వేడుకలు

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని ద్రోణ ఉన్నత పాఠశాలలో బుధవారం ముందస్తు హోలీ సంబురాలు నిర్వహించారు. విద్యార్థులు ఒకరికొకరు రంగులు చల్లుకొని సందడిగా గడిపారు. కరస్పాండెంట్ సురేశ్ రెడ్డి, హెచ్‌ఎం గంగాధర్, ఉపాధ్యాయుడు ముత్యం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోస్టల్ సేవలపై అవగాహన

సోన్: పోస్టల్ బ్యాంకింగ్ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా మేనేజర్ సిరిసిల్ల కళ్యాణ్ అన్నారు. మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో బుధవారం రైతులతో పోస్టల్ బ్యాంకింగ్ ఖాతాలు ఓపెన్ చేయించినట్లు పేర్కొన్నారు. పోస్టల్‌లో బీమా ప్రీమియం రూ.520 నుంచి రూ.750 వరకు చెల్లించి రూ.50లక్షల వరకు పరిహారం పొందవచ్చని పేర్కొన్నారు. ఏఈఓ అశోక్, షహనాజ్, నిర్వాహకులు పవన్, పుష్పలత, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

26న ఉచిత వైద్యశిబిరం

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈనెల 26న నిర్వహించే ఉచిత కంటి ఆపరేషన్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నేత్ర వైద్య సహాయ అధికారి గంగవరం రాంరెడ్డి తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, విజన్ సెంటర్ ఖానాపూర్ సీహెచ్‌సీ ఆధ్వర్యంలో జరిగే శిబిరానికి ఆపరేషన్ కోసం హాజరయ్యేవారు ఆధార్, రేషన్, ఆరోగ్యశ్రీకార్డుల జిరాక్స్‌లతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 99857 3 7466 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

14న హోలీ

నిర్మల్‌చైన్‌గేట్: వేద పండితుల సూచన మేరకు ఈనెల 13 కామ దహనం, 14వ తేదీ హోలీ జరుపుకోవాలని విశ్వహిందూ పరిషత్ నగర అధ్యక్షుడు ముప్పిడి రవి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గాంధీచౌక్ లో హోలీ సంబరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాలు తనిఖీ

ఖానాపూర్: పట్టణంలోని ఇంటర్ పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి బలరాం జాదవ్, సిట్టింగ్ స్క్వాడ్ వెంకటేశ్వర్లు, రహమాన్ తనిఖీ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు ఏఆర్‌ఎస్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను సందర్శించారు. ప్రభుత్వ కళాశాలలో 272 మందికి గాను నలుగురు గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ అబ్దుల్ హమీద్ తెలిపారు. ఏఆర్‌ఎస్ జూనియర్ కళాశాలలో 272 మందికి గాను ఏడుగురు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ రమేశ్‌నాయక్ పేర్కొన్నారు.

ఉద్యమ సమితి అడ్‌హక్ కమిటీ


ఎన్నికైన కార్యవర్గం

ఖానాపూర్: ఖానాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉద్యమ సమితి అడ్‌హక్ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని పీఆర్‌టీయూ భవన్‌లో బుధవారం రాత్రి జరిగిన సమావేశంలో పట్టణ వాసుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా కాసవేణి ప్రణయ్, కోకన్వీనర్‌గా రాపెల్లి రాజు, గౌరవ అధ్యక్షుడిగా రాజేశ్వర్, న్యాయ సలహాదారుగా సుమిత్, ముఖ్య సలహాదారులు, కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.

మాజీ కౌన్సిలర్ మృతి


రాజేశ్వర్(ఫైల్)

భైంసాటౌన్: పట్టణంలోని 23వ వార్డు మాజీ కౌన్సిలర్ వడ్నప్ రాజేశ్వర్(48) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. గణేశ్‌నగర్‌కు చెందిన రాజేశ్వర్ 2020 మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రాజేశ్వర్ మృతిపై పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

డోడర్నా విద్యార్థి ప్రతిభ


సైకిల్ అందిస్తున్న ఐటీడీఏ పీవో

కుభీర్ : మండలంలోని డోడర్నా ఆశ్రమ పాఠశాలలో నాలుగో తరగతి చదివే అడే విజయ్ మంగళవారం ఉట్నూర్‌లో నిర్వహించిన వర్డ్ పవర్ (ఆంగ్లపదాలు) చాంపియన్ షిప్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా విద్యార్థికి బహుమతిగా సైకిల్ ప్రదానం చేశారు. విద్యార్థిని బుధవారం పాఠశాలలో హెచ్‌ఎం చంద్రశేఖర్, సిబ్బంది అభినందించారు.

పలువురి అరెస్టు.. విడుదల


పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్సై, మాజీ సర్పంచ్‌లు

దస్తురాబాద్: మండలంలోని ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, వీఆర్‌ఏలను బుధవారం అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో మాజీ సర్పంచ్‌లు, వీఆర్‌ఏలు చలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారనే సమాచారంతో ముందస్తుగా అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వీరిని పూచీకత్తుపై విడుదల చేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కడెం: మండలంలోని సారంగపూర్‌లో బుధవారం సీసీరోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులను పంచాయతీ రాజ్ ఏఈఈ సూర్యతేజ, గ్రామస్తులు ప్రారంభించారు. ఈజీఎస్ నిధులు రూ.18 లక్షలతో పనులు చేపట్టినట్లు ఏఈ పేర్కొన్నారు. సుధాకర్, శ్రీనివాస్, లక్ష్మణ్, రమేశ్, సత్తెన్న, భూమన్న, లింగన్న ఉన్నారు.

కేసీఆర్ వనంలో చెట్ల నరికివేత


నరికిన చెట్లను పరిశీలిస్తున్న అటవీ అధికారులు


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై శంకర్

- దస్తురాబాద్ మండలంలో అడ్డుకున్న అటవీశాఖ అధికారులు

దస్తురాబాద్: గ్రామాభివృద్ధికి అటవీశాఖ నిబంధనలు అడ్డుగా వస్తున్నాయని బుధవారం దస్తురాబాద్ మండలంలోని దేవునిగూడెం సమీపంలో కేసీఆర్ హరితవనంలో నాటిన 60 చెట్లను నరికి నిరసన తెలిపారు కొందరు గ్రామస్తులు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు అక్కడకు వచ్చి వారిని అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే.. దేవునిగూడెం గ్రామసమీపంలో అటవీశాఖకు చెందిన 125 ఎకరాల్లో హరితహారంలో భాగంగా 2015లో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో లక్ష మొక్కలు నాటారు. కేసీఆర్ కూడా పాల్గొని మొక్కలు నాటారు. దీంతో అటవీశాఖ ఆ వనానికి కేసీఆర్ హరితవనంగా నామకరణం చేసింది. కేసీఆర్ హరితవనం ఎదురుగానే గ్రామస్తులు నల్లపోచమ్మ ఆలయం ఏర్పాటు చేశారు. ఈ ఆలయం నిర్మించుకునేందుకు గ్రామానికి రెండువైపులా బీటీ రోడ్డు మంజూరైనా అటవీశాఖ అనుమతులివ్వడం లేదు.

60 చెట్లు ధ్వంసం..

అడవి ఉందనే కారణంతోనే అనుమతులు ఇవ్వడం లేదని గ్రామస్తులు మూకుమ్మడిగా కేసీఆర్ హరిత వనంలోని 60 చెట్లను ధ్వంసం చేశారు. ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు పోలీసుల సహకారంతో ఘటనా స్థలానికి వచ్చారు. ఎస్సై శంకర్ గ్రామస్తులకు నచ్చజెప్పడంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం హరితవనంలో నరికివేసిన చెట్లను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు కింగ్ ఫిషర్, సిదార్థ, ఆనంద్, జిబియాబాయి, రవి, సుమాన్ స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకనే అడ్డుకున్నాం..

అటవీశాఖ పరిధిలో అభివృద్ధి పనులు జరగాలంటే అనుమతులు తప్పనిసరి. అనుమతుల్లేకుంటే అటవీశాఖ పరిధిలో పనులు జరగనివ్వమని కడెం ఎఫ్‌ఆర్వో గీతారాణి తెలిపారు. హరితవనంలో చెట్లను ధ్వంసం చేసిన వారి గుర్తించి.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఖానాపూర్ ఏఎంసీ చైర్మన్‌గా భూషణ్


భూషణ్

కడెం: ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కడెం మండలంలోని పెద్దబెల్లాల్ పంచాయతీ పరిధి హరిజనవాడకు చెందిన పడిగెల భూషణ్(భూమన్న), వైస్ చైర్మన్‌గా ఖానాపూర్‌కు చెందిన అబ్దుల్ మాజిద్ నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం రాష్ట్ర అగ్రికల్చర్ కోఆపరేటివ్ సెక్రటరీ రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. సభ్యులుగా దండుగుల యాదగిరి, ఊరే జలజ, లక్కవత్తుల నారాయణ, దాత్రుక గంగాధర్, అశోక్‌రావు, తోకల మహేందర్, చిన్నరాజన్న, తొడసం విఠల్, గంప దయాకర్, శేఖ రయ్య, పుల్యానాయక్, నారాయణరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా భూషణ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సద్దుమణిగిన కుల వివాదం


ఇరువర్గాలతో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్, అధికారులు

లక్ష్మణచాంద: మండలకేంద్రంలో కుల బహిష్కరణ వివాదం తొలగిపోయింది. లక్ష్మణచాందలోని మాల సంఘానికి చెందిన 14 కుటుంబాలవారు.. తమను కుల సంఘం నుంచి బహిష్కరించారని ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డికి, ఇటీవల కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్, ఎస్పీ జానకీషర్మిల ఆదేశాల మేరకు బుధవారం మండలకేంద్రంలో డీపీవో శ్రీనివాస్, తహసీల్దార్ జానకి, ఎస్సై సుమలత ఆధ్వర్యంలో ఇరువర్గాలను పిలిపించి వారితో మాట్లాడారు. వివాదాలకు దూరం ఉంటూ ఐకమత్యంతో మెలగాలని సూచించారు. దీనికి ఇరువర్గాల నాయకులు అంగీకరించడంతో సమస్య సద్దుమణిగింది. అనంతరం ఇరువర్గాలను ఒకరి చేతిలో మరొకరి చేయి వేయించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


అవగాహన కల్పిస్తున్న ఏపీఎం అశోక్

కుంటాల: మహిళలు చట్టాలు తెలుసుకొని అవగాహన పెంచుకోవాలని ఏపీఎం అశోక్ పేర్కొన్నారు. బుధవారం కుంటాల రైతువేదికలో స్వయం సహాయక సంఘాల మహిళలకు మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని.. సినిమాల్లో అవకాశాలు కల్పిస్తామని.. వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ చేయడం, మహిళల అక్రమ రవాణా గురించి వివరించారు. ఆపదలో 1098, 108, 1930, 181, 100 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. సమావేశంలో సీసీలు పెంటన్న, యూసుఫ్, కవిత, వీవోఏలు, గ్రామ సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

మురుగు కాల్వలను శుభ్రం చేయాలి


లోకేశ్వరంలో పరిశీలిస్తున్న సుదర్శన్

లోకేశ్వరం: గ్రామాల్లోని మురుగుకాల్వలను శుభ్రం చేయాలని భైంసా డీఎల్‌పీవో సుదర్శన్ అన్నారు. బుధవారం లోకేశ్వరం, అబ్దుల్లాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా నర్సరీలు, మురుగు కాల్వలు, సెగ్రిగేషన్ షెడ్లు, పల్లె ప్రకృతివనాలను పరిశీలించారు. ఈసందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా నీటిని అందించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలన్నారు. వందశాతం ఇంటి పన్నులను వసూలు చేసి గ్రామపంచాయతీల అభివృద్ధికి పాటుపడాలని ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. కార్యదర్శులు రాజేశ్వర్, రాజు ఉన్నారు.